కోటానుకోట్ల మైళ్ళ దూరంలో ఉన్న ఒంటరి నక్షత్రం చీకటి పులుము కొన్న ఆకాశంలో మిణుకుమిణుకుమని ప్రకాశిస్తుంది. కనిపిస్తుంది గాని కాంతి నివ్వలేకపోతుంది.

ఆ నక్షత్రాన్ని అరగంటనుండి చూస్తున్నాడు, బాల్కనీలో ఒంటరిగా కూర్చున్న సుబ్బరాజు. అతని మనసు పొరల్లో ఎక్కడో చిక్కుకున్న ఆలోచన ఒకటి గజిబిజిగా కదులుతుంది గాని ఊపిరి పోసుకొని బయటపడలేక పోతుంది.

చలిగాలి రివ్వున వీస్తోంది.

మంచుకి వీధిదీపాలు మసగ్గా కనిపిస్తున్నాయి.

కాలనీ చుట్టూ గస్తీతిరుగుతున్న గూర్ఖా విజిలు అప్పుడప్పుడు బిగ్గరగా వినిపిస్తోంది.

సుబ్బారావు బరువుగా కళ్ళుమూసుకున్నాడు. గుండెల్లో ఆవేదన తన్నుకొస్తుంది. చెప్పుకోవటానికి దగ్గరలో ఎవరూ లేరు. దగ్గరలోనే కాదు దూరంలో కూడా లేరు. 'తనవాళ్ళు' అనే వాళ్ళు ఎవరూ లేరు.

జీవితంలో ఎన్నో అనర్థాలు జరిగిపోయాయి. సరిదిద్దుకోవటానికి వీల్లేకపోయింది. అతను అన్నీ పోగొట్టుకున్నాడు. ఒంటరిగా నిస్సహాయంగా మిగిలిపోయాడు. అంతా స్వయంకృతాపరాధం. దానికి పశ్చాత్తాపం లేదు.

ఒకప్పుడు అతనొక సెంటిమెంటల్ ఫూల్.

కొందరి దృష్టిలో సెంటిమెంట్లు పిప్పరమెంట్లులాంటివి కావాచ్చు. అయితే, తీపికూడా చేదే అని తొందరగా గ్రహించకపోతే, ఆ మనిషి జీవితగమనమే చిత్రవిచిత్రంగా మారిపోతుంది.

అతని ఏకాగ్రతకి అంతరాయం కలిగిస్తూ నీరజరూపం స్మృతిపథంలో నిలిచింది. అతన్ని నిరసిస్తూ నవ్వుతుంది. గుండెల్ని మండిస్తూ మాట్లాడుతుంది.

"శరీరానికి దెబ్బలేగిలినప్పటికీ మీ సెంటిమెంట్లు మానుకోలేకపోయారు. కానీ, హృదయానికి గాయమైతే మీరు నమ్ముకున్న సంకుచిత చాంధస భావాల్నుంచి బయటపడగలరనే నమ్మకంతో మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను."



♦ ♦ ♦

"అబ్బబ్బా! ఎన్నిసార్లు వెనక్కితిరిగొస్తారు... లేటయితే మీ ఆఫీసరు ఊరుకుంటారా?" నీరజ చిరాకుపడింది. బుంగమూతి పెట్టి పక్కకు తప్పుకుంది.

"అలా అంటే ఎలా, నీరజా! వీధిలో శకునం బావుండలే..." గుండెలమీద కుడిచేయి ఆనించి ఓ క్షణం కళ్ళుమూసుకున్నాడు.

"ఇంట్లో వేరూ... వీధిలో వేరూ... మీ చాధస్తాలతో నాకూ పిచ్చెక్కిస్తున్నారు."

"ఊరికే కొట్టిపడెయ్యకు... మనిషి జీవితం సాఫీగా సాగాలంటే పెద్దవాళ్ళు పెట్టిన శాస్త్రాన్ని గౌరవించాలి."

"అటు చూడండి! ఎదురింటి ఇంజనీరు మనల్ని చూసి నవ్వుతున్నాడు." నీరజ చటుక్కున తల దించింది.

"బ్రహ్మచారి కదూ?... పాపం! అతనికి ఏమీ తెలిసి ఉండదు." సుబ్బరాజు కోపం తెచ్చుకోలేదు.

మళ్ళీ 'ఎదురు' రాపడం ఆమెకి తప్పలేదు. మనసులో కోటి దేవతలను తలుచుకుంటూ అతను సైకిలు ఎక్కాడు.

నీరజ తలుపులు వేసుకొనేముందు అప్రయత్నంగా ఎదురింటివేపు చూసింది. ఇంజనీరు తనవేపు చూస్తూ నవ్వుతున్నాడు. అతని కళ్ళలో ఏదో భావం తన మనసులో గుచ్చుకున్నట్లైంది. అతని చూపుల్ని తప్పించుకొని దభాల్న తలుపులు వేసింది.

# ఆలంబన

శ్రీరాజ్

కాసేపు ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

మొదట్నుంచి సుబ్బరాజులో కొన్ని మానసిక బలహీనతలున్నాయి. చాంధస భావాలు, మూఢవిశ్వాసాలు, సెంటిమెంట్లు- అతని బుర్రలో గూళ్ళుకట్టుకొని నివాసం ఏర్పరచుకున్నాయి. అవి పూర్తిగా నిజమూ కాకపోవచ్చు. అబద్ధమూ కాకపోవచ్చు. అయితే అతన్ని నడిపించడంలో అవి బ్రేకుల్లా మాత్రం ఎప్పుడూ పనిచేయలేదు.

ఇంట్లో అతను చేసే పనులకు నీరజ మండిపడుతుంది. అప్పుడప్పుడు అతని అమాయకత్వానికి జాలిపడుతుంది కూడా

'అసలు ఇతను ఎలా పెరిగారు? ఎలా చదువుకున్నారు? ఎలా ఉద్యోగం చేస్తున్నారు? ఏంసాధించాలనుకుంటున్నారు?' ఇలాంటి ఆలోచనలు తరచుగా ఆమెను కలవరపెడుతుంటాయి.

"బాబూ! వీర వెంకట సత్యశాయి హరి హర వరప్రసాద కృష్ణమూర్తీ..."

"కొండవీటి చేంతాడులా అంత పెద్ద పేరుతో పిలవొద్దని మీ కెన్నిసార్లు చెప్పాను. ముద్దుగా 'బాలూ' అని పిలవండి."

"బాలూ, బేటూ... అలా పిలిస్తే, ఆ దేవతలు మా పెద్దలు కోపగించుకుంటారోయ్..."

"మీ మీద నా కెంతవరకు కోపం ఉంది."

"తొందరగా నీళ్ళు తోరుపుతావా, నీరజా?"

"ఈరోజు షేవ్ చేసుకోవడంలేదా, శ్రీవారూ?"

"వారం తిధి బావుండలేదమ్మడూ.."

"గెడ్డాలబూచాడిలా ఉంటే, బాలూగాడు జడుసుకుంటాడు."

"ఏవండీ! షాంపూతో తల రుద్దుకోండి, జుత్తు మెత్తబడుతుంది."

"ఆదివారం తలంటుకుంటే మా అన్నయ్యలకి కీడు జరుగుతుంది."

"ఏమిటీ, బక్కెట్లో నీళ్ళుంచారు... మొఖం బాగా కడగండి, సబ్బు అంటుకుంది."

"చివర్న ఓ రెండు చెంబుల నీళ్ళు విడిచిపెట్టాలి, నీరజా! లేకపోతే మీ అమ్మగారు బీదవారవుతారు."


"నీ కెన్నిసార్లు చెప్పాలోయ్, తడి బట్టలు తువ్వాళ్ళు తలుపులమీద వెయ్యొద్దని..."

"అవునవును ... కోరి కష్టాలు తెచ్చుకోవటం కదూ, అలా వేస్తే...?"

"సట్టింట పొడిగీతలు రాయడం మంచిది కాదు, బాబూ! వీరవెంకట..."

"...మనం అప్పులుపాలు అయిపోతామని మీ నాన్న బెంగరా, బాలూ..."

"ఇది రెడీమేడ్ డ్రెస్సండీ ... రివర్స్ చేసి వేసుకోవచ్చు. ఈ ఫ్యాషన్ బాలూగాడి కెంతో బావుంటుంది."



"నువ్వు బొత్తిగా వినిపించుకోవు కదా? కుట్టినబట్టలు తిరగేసి వేసుకుంటే తల్లిదండ్రులుగా, మనకి అరిష్టం నీరజా!"

"ఉల్లి పెసరట్టు ఉప్మా టేబిల్ మీద పెట్టాను. టిఫిన్ తీసుకోండి."

"ఈరోజు శనివారం, ఉల్లి ముట్టను కదా? కాఫీ యిస్తే చాలు..."

"ఆ డొక్కు సైకిలుమీద ఆఫీసుకి వెళ్ళటానికి మీకు సిగ్గుగా లేదూ? ఓ స్కూటరు కొంటే హోదాగా ఉండదా?"

"అచ్చొచ్చిన సైకిలు, నీరజా! మా నాన్న నాకెంతో ప్రేమతో యిచ్చారు."

"సాయంత్రం వచ్చేటప్పుడు పువ్వులు కొని తీసుకువస్తారట. మంచివారు కదూ!"

"తప్పకుండా తీసుకొస్తాను. దేవుడికి అలంకరిస్తే ఎంతో బావుంటుంది."

"డబుల్ కాట్ ఫోంబెడ్ ఖాళీగా ఉంచి, నేలమీద పడుకుంటారేవిటండీ?"

"సోమవారం నాడే మా నాన్న శివ సాయుజ్యం పొందారు, నీరజా! ఒంటి పూట భోజనం, కటిక నేల పడక తప్పవు."

"ఇవ్వేళ మన పెళ్ళిరోజు. నేను మంచమ్మీదే పడుకుంటాను."

"అభ్యంతరం ఏముంది? అలాగే పడుకో."

"కొంతమంది యువకులు పుట్టుకతోనే వృద్ధులట. ఆ మాట ఎవరన్నారో మీకు తెలుసా?"

"ఆ మాట ఎవరన్నదీ మా బామ్మ ఎప్పుడూ చెప్పలేదు, నీరజా!"

నెల పొడుపులో కడలి తరంగంలో సుబ్బరాజుకి ఏవో మూఢ నమ్మకాలు కనిపిస్తాయి. పసిపాప బోసినవ్వుల్లో ప్రేయసి అధరాల్లో సెంటిమెంట్లు మెరుస్తాయి.

అతనితో సరదాగా కబుర్లు చెప్పాలని, సెలవు రోజుల్లో షికార్లు చెయ్యాలని, ప్రతిక్షణం కలిసిమెలిసి ఉండాలని ప్రపంచాన్ని దగ్గరగా చూడాలని, నీరజ ఆశపడుతుంది. అతని డైరీలో ఆదివారం ఖాళీ ఉండి ఉంటే ఆ రోజు మాత్రమే పెళ్ళాంతో ముద్దూ ముచ్చటా.

ఈ ఎలక్ట్రానిక్ యుగంలో ఇక్ష్వాకులనాటి స్టయిల్లో బతకడం అంటే ఆమెకి యిష్టం ఉండదు.

ఒకసారి ఏమయిందంటే?...

"అమ్మగారూ! అమ్మగారూ! తలుపు తియ్యండీ..."

నీరజ తలుపు తీసేసరికి ఎదురుగా ఆఫీసు బంట్రోతు, సుబ్బరాజు కనిపించారు. అతని కుడికాలికి కట్టిన బ్యాండేజీ సగానికి పైగా రక్తంతో తడిసింది. తలకి ఒక ప్రక్క ప్లాస్టరు అంటించి ఉంది. అతను నడవలేకపోతున్నాడు. బంట్రోతు సాయంతో హాల్లో సోఫామీద పడుకున్నాడు. బాధగా మూలుగుతున్నాడు.

నీరజ దుఃఖం ఆపుకోలేకపోయింది.

బంట్రోతు ప్రమాదం ఎలా జరిగిందో ఆమెకి చెప్పాడు.

సుబ్బరాజు ఏకాఎకిగా ఆఫీసులోకి ప్రవేశించాడు. లోపలికి అడుగుపెట్టిన మరుక్షణమే బయటకు వచ్చేస్తాడు. మళ్ళీ అలాగే చేస్తాడు. ముచ్చటగా మూడోసారి అడుగుపెట్టిగాని తన సీటు దగ్గరకి వెళ్ళడు. మనకి కనిపించకుండా మన చుట్టూ తిరిగే క్షుద్రదేవతల దృష్టినుండి తప్పించుకోవటానికి అలా చేయాలిట.

ఆ రోజు అలాగే ఆఫీసు బిల్డింగు ముందున్న పది మెట్లూ ఎక్కి దిగుతున్నప్పుడు ఓ కొంటెకుర్రాడు అరటి తొక్క వాళ్ళకి అడ్డుగా విసిరేసరికి, సుబ్బరాజు జారి కిందపడ్డాడు. ముచ్చటగా మూడోసారి ఆఫీసులోకి అడుగుపెట్టబోయిన అతను-సెంటిమెంటు బెడిసి కొట్టి కాలు చిదగ్గొట్టుకొని ఇంటికి వచ్చాడు.

ఆ విషయం చెప్పేటప్పుడు బంట్రోతు గడుసుగా నవ్వడం నీరజ చూడక పోలేదు. ఇందాక చోటుచేసుకున్న దుఃఖం పోయి, అతని మీద కోపం ముంచుకొచ్చింది.

మర్నాడు ఎదురింటి ఇంజనీరు సుబ్బరాజును చూడ్డానికి వచ్చాడు.

నీరజ చాటుగా గదిలోకి వెళ్ళింది.

"గురూగారూ! రాత్రంతా మీ ఇంట్లో లైట్ వెలగడం, మీ మూలుగులు వినిపించడం...ఆలోచిస్తే మీకేదో యాక్సిడెంటు జరిగిందని అనుకుంటున్నాను. యామై కరక్ట్?..."

"దిక్కుమాలిన రోజు బావుండక పోతే అంతేనండీ...దుశ్శకునాల ఫలితం ఊరికే పోదు."

తన విచారాన్ని చాలా సున్నితంగా వ్యక్తం చేశాడు, ఇంజనీరు. సుబ్బరాజు బాధను మరిపిస్తూ సరదాగా కబుర్లు చెప్పాడు. అతను చెప్పిన జోకులకు నీరజ నవ్వు ఆపుకోలేకపోయింది.

"డాక్టరు దగ్గరికి నా కారులో తీసుకువెళ్తాను. రండి, గురూగారూ!"

"వద్దండీ... ఈ రోజు అమావాస్య. డాక్టరు దగ్గరికి వెళితే, యముడి దగ్గరికి వెళినట్లే...అయినా, మంత్రాలతో పోయే దానికి మందులెందుకండీ?"

ఆ మాటలకి ఇంజినీరు గొల్లున నవ్వేడు.

"నమ్మిన శాస్త్రాలు మీ ప్రాణాన్ని నిలబెడితే ఇంట్లోనే ఉండండి. మీ సెంటిమెంట్లు మీ గాయాన్ని నయంచేస్తే డాక్టరు దగ్గరికి వెళ్ళకండి. మీ యిష్టం వచ్చినట్లు చేసుకొండి కానీ...పై వాళ్ళ దగ్గర మీ మూర్ఖత్వాన్ని బయట కండి... నన్ను తలవంచుకొని పడేలా చెయ్యకండి..." ఇంజనీరు వెళ్ళిన తర్వాత నీరజ కస్సుమంది. ఆమె రౌద్రరూపం చూసి సుబ్బరాజు అవాక్కయిపోయాడు.

సాంప్రదాయాన్ని ఆమె యిష్టపడుతుందేమోగాని బాధస్తాన్ని మాత్రం సహించలేదు.

మొత్తానికి నెలరోజులకిగాని కాలు స్వాధీనంలోకి రాలేదు. సుబ్బరాజు సెలవుపెట్టుకొని ఇంట్లోనే ఉన్నాడు. నీరజ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని బూజు భావాల ఊబినుండి అతన్ని బయటకు లాగాలని శతవిధాల ప్రయత్నించింది. ఫలితం మాత్రం బూడిదలో పోసిన పన్నీరే అయింది.

సుబ్బరాజు డ్యూటీకి రిపోర్టు చేశాడు.

అతని అలవాట్లు, సెంటిమెంట్లు—మామూలే!

గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సుకి ఎక్కవలసిన గమ్మత్తయిన ఓ సెంటిమెంటుంది. సుబ్బరాజు సైకిలు ఎక్కేటప్పుడు స్టాండుని మూడుసార్లు కుడి కాలితో గట్టిగా తంతాడు. తర్వాత నిదానమే ప్రదానంగా సైకిలు తొక్కుతాడు. అలాంటి సందర్భంలో ఆ మానవుడి సంబరం మాటల్లో చెప్పడం కుదరదు. కానీ, అందులో అంతరార్థం మాత్రం ఆఫీసులో ఎవరికీ అంతుబట్టలేదు.

ఆ రోజు కూడా అలవాటు ప్రకారం సైకిలు స్టాండును తన్నబోయిన సుబ్బరాజు 'కంయ్' మన్నాడు. పాతపుండును కొత్తదెబ్బ పరామర్శించే సరికి నెత్తురు బొటబొటా కారింది.

"సుబ్బరాజూ! నువ్వు స్టుపిడ్‌వి. బ్లడీ ఫూల్‌వి. స్కూటరుమీద రావలసినవాడివి సైకిలు మీద వస్తున్నావు. వస్తే వచ్చేవ్. ఆ సైతాను పన్లేంటి? గాడిదలా కాలితో తన్నడం ఏంటి? తన్నడానికి సైకిలే దొరికిందా? మనం చేసే ఏ పనికైనా ఓ అర్థం ఉండాలి. పరమార్థం కనిపించాలి. అసలు ఈ సెంటిమెంటువాన్ని నిర్వచించగలవా?...నీ సెంటిమెంట్లు తగలెయ్యా...నీ బుర్రని పరిశోధన కోసం రష్యా పంపించాలి. అమెరికాలో యిన్షూర్ చేయించాలి. స్విస్ బ్యాంక్‌లో పాతిపెట్టాలి.

"అసలు నువ్వు సంసారం సరిగా చేస్తున్నావా? రాత్రి పక్కమీద సెంటు బుడ్లుంటున్నాయా. సెంటిమెంట్లుంటున్నాయా?" ఆఫీసరు రామనాథం పీలున్నంత వరకు ఉతికాడు, సుబ్బరాజుని పట్టుకొని.

అన్నిటికీ సమాధానంగా సుబ్బరాజు చిన్నగా నవ్వి తలవంచుకున్నాడు.

ఆ రాత్రి నీరజ క్లాసు తీసుకుంది.

"చూడండీ! ఈ శకునాలు, సెంటిమెంట్లు కేవలం ట్రాష్. పనిలేనివాళ్ళు పనికిమాలినవాళ్ళు కల్పించినవి. మనం మంచిదనుకున్నది, పదిమందికీ మంచి నివ్వగలిగిన ఏ పని చేయటానికీ వారం వర్జ్యం అక్కరలేదండీ. సెంటిమెంట్ల సెంటు పూసుకోనవసరం లేదండీ. ఏకాగ్రత, బాధ్యత ముఖ్యం.

"ఈ వైజ్ఞానిక యుగంలో మీరింకా సెంటిమెంట్ల ఊబిలో కొట్టుకోవటం న్యాయం కాదండీ... మిమ్మల్ని నష్టపరుస్తున్న మీ బాధస్తాలను విడిచిపెట్టండి. అందరిలా మానసికంగా ఎదగండి. మీ తెలివితేటలతో సమస్యల్ని ఎదుర్కొండి...రేపొద్దుట, ఈ మూఢ విశ్వాసాల ఫలితంగా మీకేమైనా జరిగితే—నేనూ, బాబూ ఏంకావాలి?"

సుబ్బరాజు మందహాసం చేశాడు.

తన మనసులో బాధ నీరజ అర్థం చేసుకోలేకపోతుంది. శకునాలను లెక్కచేయనప్పుడు. శాస్త్రాన్ని ఎదిరించినప్పుడు. సెంటిమెంట్లు కాదన్నప్పుడు ఎన్నో నష్టాలు జరిగిపోయాయి. కన్నతల్లి కన్ను మూసింది. ప్రేమగా చూసే తండ్రి దూరం అయ్యాడు తన కుటుంబం ఛిన్నాభిన్నమయింది. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి. అంతెందుకూ—ఈ మధ్య తనకి జరిగిన రెండు ప్రమాదాలకు అలాంటి మూర్ఖత్వమే కారణమైంది.

'నీరజా! నా మనసులో ఆవేదన చెప్పడం చాతకాకపోవచ్చు. కానీ, ఈ సెంటిమెంట్లు నా జీవితంలో చాలా నిర్దుష్టమైనవి. శక్తివంతమైనవి. మార్గదర్శకమైనవి కూడా. నా నుండి నా నీడను వేరుచేయడం ఎంత అసాధ్యమో ఈ సెంటిమెంట్లను తొలిగించడం కూడా అంతే అసాధ్యం...నీ మాట కాదంటున్నందుకు నన్ను క్షమించు..."

ఆమె విస్తుపోయింది. మూర్ఖుడిలో ప్రక్షాళన ఆశించడం మృగతృష్ణలో దప్పిక తీర్చుకోవడం లాంటిది.

'బాధస్తం మొగుడికి చెప్తే చిరాకు. చెప్పకపోతే పరాకు' అని నీరజ మనసులో తిట్టుకుంది.

♦ ♦ ♦



తెల్లవారు మూడుగంట లవుతుంది.

బంగారంలాంటి కల కరిగిపోయింది. సుబ్బరాజు దిగ్గున లేచి మంచమ్మీద కూర్చున్నాడు. కలిసొచ్చే అదృష్టాన్ని తలచుకుంటూ భార్యను పిలిచాడు.

నీరజ మంచంమీద లేదు. గదిలో కనిపించలేదు. ఇంట్లో అసలు లేదు.

డ్రాయింగు రూంలో టేబిలుమీద రెపరెప లాడుతున్న ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు సుబ్బరాజు.

'ఏవండీ!'

నేను తప్పు చేస్తున్నానని నాకు తెలుసు. నన్ను క్షమించమని కాదు. నా నిర్ణయంలో ఎలాంటి పొరపాటులేదని మీరు గ్రహించటానికే ఈ ఉత్తరం రాస్తున్నాను.

నేను స్వేచ్ఛాజీవిని. నా గుండెలో ఆశలున్నాయి. నా మనసులో కోరికలున్నాయి. నా కళ్ళలో కలలున్నాయి. ఎప్పుడూ వాటిని మీరు అర్థంచేసుకోలేదు. కనీసం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. మీ చాదస్తాలతో నన్ను హింసించారు. మీ సెంటిమెంట్లతో నన్ను విసిగించారు. భార్యగా నన్ను మరిచిపోయారు. ఇల్లాలిగా నన్ను అశ్రద్ధ చేశారు. మీ ప్రేమానురాగాలను కరువుచేశారు.

మిమ్మల్ని నేను మార్చలేను. మీరు మారి నన్ను సుఖపెట్టలేరు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళకున్నాయి. బతికినంతకాలం మనం సమాంతర రేఖల్లా సాగవలసిందే.

నిస్సారంగా బతకడం అంటే నాకు విసుగు. అందుకే, నన్నర్థం చేసుకున్న వ్యక్తి-ఎవరో కాదు, ఎదురింటి ఇంజనీరుతో లేచిపోతున్నాను.

శరీరానికి దెబ్బతగిలినా మీ సెంటిమెంట్లు మానలేకపోయారు. కానీ హృదయానికి గాయమైతే మీరు నమ్ముకున్న సంకుచిత చాంధస భావాల్నుంచి బయటపడగలరనే నమ్మకంతో మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను.

'బాలూ' ప్రతిబింబం గనక కన్నతల్లి మమకారాన్ని చంపుకుంటున్నాను. వాడ్ని మాత్రం అన్యాయం చేయకండి. మీ బలహీనతలు రుద్దకండి. మనిషిగా పెరగనివ్వండి.

నన్ను మన్నించి, నా ప్రార్థన మన్నిస్తారని సెలవు తీసుకుంటున్నాను.

ఈ క్షణం నుండి మీకు ఏమీ కాని-
'నీరజ.'

మిన్ను విరిగి మీదపడినట్లయింది సుబ్బరాజుకి. ఏళ్ళతరబడి వేళ్ళు పాతుకొని ఉన్న పిచ్చి నమ్మకాలు - మనసు పొరల్ని చింపుకొని, మెదడు నరాల్ని తెంపుకొని బయటకు దూసుకువచ్చాయి. అవును, నిజమే తన శరీరానికి దెబ్బ తగిలినప్పుడు ఇంతగా విలవిల్లాడలేదు. నీరజ తనకి లేకపోయేసరికి ప్రపంచమే శూన్యంగా కనిపిస్తుంది.

మొదటిసారి అతనిలో మానసిక సంఘర్షణ మొదలయ్యింది.

నమ్మిన సిద్ధాంతాలే తనని చిత్రవధ చేశాయి. సృష్టించుకున్న తన సెంటిమెంట్లే దారుణంగా మోసగించాయి.

వీరవెంకట సత్యాలాయి...కాదుకాదు ...బాలూ లేచి, అమ్మను అడిగితే ఎలా ఊరడించాలి? నీరజ ఏమయిందని ప్రశ్నిస్తే, ఇరుగూ పొరుగులకు ఏ సమాధానం యివ్వాలి? ఆఫీసుకి వెళ్ళే ముందు 'ఎదురు' వస్తుందని ఎవర్ని పిలవాలి.

నిప్పును గుప్పెట్లో దాచడం ఎవరి తరం కాదు. నీరజ లేచిపోయిన సంగతీ అందరికీ తెలిసిపోయింది. వీధిలో జనం గుసగుసలు చెప్పుకున్నారు. ఆఫీసులోవాళ్ళు అవహేళన చేశారు, గుండె గాయమైనప్పుడు గాని అతనికి జ్ఞానోదయం కాలేదు.

గుడ్డిగా నమ్మినప్పుడు సెంటిమెంట్లు అతన్ని ప్రతిక్షణం భయపెట్టాయి. మొండిగా ఖాతరుచెయ్యకపోగా అవి రెక్కలు కట్టుకొని ఎగిరిపోయాయి, సుబ్బరాజుని వదిలి. ఈ విషయం తెలిస్తే! నిజంగా నీరజ సంతోషిస్తుంది. కానీ, ఆమె ఎక్కడుందో? ఆమె మనసు అద్దంలాంటిది. బద్దలయిన ఆ మనసు మళ్ళీ అతుక్కుంటుందా?

అమ్మను మరిపించి, బాలూని సముదాయించడం సుబ్బరాజుకి చాలకాలం చేతకాలేదు.

అనంతకాలగర్భంలో ఒక సంవత్సరం నిస్తేజంగా కలిసిపోయింది,

హాల్లో నిద్రపోతున్న బాలూ కెవ్వున అరిచేసరికి సుబ్బరాజు వాస్తవంలోకి వచ్చాడు. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ బాల్కనీ నుంచి హాల్లోకి నడిచాడు.

'అమ్మా...అమ్మా' అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

ఆ మధ్య సుబ్బరాజు కొడుకుని తీసుకొని తిరుపతి వెళ్లాడు మొక్కుబడి కోసం కాకుండా కేవలం మానసికంగా ఊరటపొందాలనే ఆశతో.

కోవెల విడిచి, కోనేరుదాటి, ఉద్యానం వేపు నడుస్తున్నప్పుడు తన చేయి పట్టుకొని నడుస్తున్న బాలూ 'అమ్మా' అని గట్టిగా పిలిచాడు. సుబ్బరాజు ఆశ్చర్యపోయాడు, దూరంగా కారు ఎక్కుతున్న ఇంజనీరు నీరజలను చూసి.

బాలూ తండ్రిచేయి విడిపించుకొని, నీరజ దగ్గరకి పరుగుతీశాడు. అక్కడకు చేరకముందే కారు ముందుకు దూసుకుపోయింది. మరిచిపోతున్న సమయంలో అమ్మ కనిపించింది. ప్రశాంతంగా మారుతున్న వాతావరణంలో కలకలం మొదలయ్యింది.

ఆ క్షణం నుండి అమ్మకావాలని బాలూ పేచీ పెడుతున్నాడు. నెలరోజులు తిరిగిపోయాయి. బాలూ బెంగతో మంచం పట్టాడు. డాక్టరుకి చూపిస్తే

తల్లి దగ్గరకు పసివాడ్ని చేర్చమని ఉచిత సలహా యిచ్చాడు.

ఎక్కడ వెదికి అమ్మను తీసుకు రావాలి? నీరజ మళ్ళీ తన జీవితంలోకి అడుగు పెడుతుందా? పైనుండి కిందికి రావటానికి ఎవరు యిష్టపడతారు? వెలుగు నుంచి చీకట్లోకి నడవటానికి ఎవరు చొరవచేస్తారు? అన్నీ ప్రశ్నలే జవాబులు మాత్రం మెదడుకి తట్టడం లేదు.

"బాలూ! రేపే అమ్మదగ్గరకు నిన్ను తీసుకువెళ్తారా..." అప్రయత్నంగా తన పెదవులుదాటి వచ్చిన ఆ మాటలకు సుబ్బరాజు ఆశ్చర్యపోయాడు.

నిజమే. భార్యగా అతని గుండెల్లోకి రావటానికి నిరాకరించవచ్చునేమో గాని తల్లిగా బాలుని ఆమె గుండెల మీద చేర్చుకోవటానికి నీరజ ఎందుకు అభ్యంతరం చెప్తుంది?


సుబ్బరాజు మనసుపొరల్లో ఎక్కడో చిక్కుకున్న ఇంనాకటి ఆలోచన ఊపిరి పోసుకొని బయటపడింది.

♦ ♦ ♦

తిరుపతి దేవస్థానంలో ఇంజనీరు అడ్రసు సంపాదించగలిగాడు సుబ్బరాజు.

మద్రాసు పోష్ లొకాలిటీలో అరిస్టాక్రేట్ బిల్డింగులో ఓ వెల్‌ఫర్నిష్డ్ ఫ్లాట్ ముందు నిలబడి, అతను బజ్జరు నొక్కాడు.

తలుపు తెరుచుకుంది.



అమ్మను వాటేసుకున్నాడు బాలూ.

నీరజను చూసిన సుబ్బరాజు నిర్ఘాంతపోయాడు.

ఆమె తెల్లనిచీరలో కళావిహీనంగా కనిపిస్తుంది. విరబోసిన జుత్తు గాలికి పిచ్చిగా కదులుతుంది. నవ్వుతూ కనిపించే ఆమె ముఖంమీద బొట్టు లేదు. పసిమి ఛాయలతో మిలమిల మెరిసే మంగళసూత్రాల స్థానంలో రుద్రాక్షతావళం వేలాడుతుంది. మట్టెలుల్లేని పాదాలు బోసిగా ఉన్నాయి.

మనిషి మనిషికీ ఓ ప్రవృత్తి. వేరు వేరు సిద్ధాంతం. పొంతన కుదరని వైరుధ్యం. ఇద్దరి పోలిక ఒక్కలా ఉండొచ్చు. గాని ఇద్దరి బుద్ధీ, మనసూ ఒక్కలా ఉండదు. ఒక్కలా ఉండే- ఈ ప్రపంచంలో యిన్ని అసమానతలు ఉండనే ఉండవు.

'చాదస్తాలు, శకునాలు, సెంటిమెంట్లు అవి పూర్తిగా నిజం అనుకొని మీరు అనర్థాలు తెచ్చుకున్నారు. అవి పూర్తిగా అబద్ధం అనుకొని ఇంజనీరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కారు ప్రమాదంలో అతను పోయారండీ' నీరజ మాట్లాడటానికి ప్రయత్నించింది. కానీ ఆమె పెదవులు వణకాయి.

తను బతికుండగానే ఆమెలోని వైధవ్యాన్ని చూల్లేని సుబ్బరాజు వెనక్కి తిరిగాడు. ఆ స్థితిలో పాత సెంటిమెంట్లు వెక్కిరింపుగా కళ్ళముందు నిలిచాయి.

వడివడిగా మెట్లుదిగి వెళ్ళిపోతున్న అతన్ని చూస్తూ ఆమె గాఢంగా నిట్టూర్చింది.